నమస్తే తెలంగాణ

# కామారెడ్డి

3 | నిజామాబాద్, శుక్రవారం 20 డిసెంబర్ 2024 | KAMAREDDY




## భానుడు గీసిన చిత్రం

ఒకవైపు భానుడి కిరణాలతో ఎరుపురంగులోకి మారిన ఆకాశం.. మరోవైపు రమణీయతను సంతరించుకున్న ప్రకృతి.. చూపరులకు ఆహ్లాదం పంచింది. ఈ సుందర దృశ్యం నగరశివారులోని మానిక్‌బండార్ వద్ద ఆవిష్కృతమవగా.. పలువురు వాహనదారులు తమ ఫోన్లలో బంధించుకున్నారు.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

# ప్రశ్నిస్తే కేసులా?

ప్రభుత్వ వైఫల్యాల్ని నిలదీస్తున్నందుకే.. కేటీఆర్‌పై అక్రమంగా కేసుల నమోదు

- హామీల అమలులో రేవంత్ సర్కారు విఫలం
- మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి
- రాజకీయ కక్షసాధింపులో భాగమే ఈ దుశ్చర్యలు
- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత
- ప్రజా వ్యతిరేకతను కప్పిపుచ్చుకునేందుకు బీఆర్ఎస్ నేతలపై బురద జల్లుతున్నారు
- రేవంత్ సర్కార్ ఆగడాలను అడ్డుకుంటాం
- మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

నందిపేట్, డిసెంబర్ 19: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయలేని ప్రభుత్వాన్ని అడుగడుగునా నిలదీస్తున్నందుకే రేవంత్ సర్కారు అక్రమంగా కేసులు పెట్టిస్తున్నదని బీఆర్ఎస్ నేతలు మండిపడ్డారు. కేటీఆర్‌పై ఏసీబీ కేసు నమోదు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. కేసులతో తమ గొంతు నొక్కలేరని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవన్‌రెడ్డి, మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్సీ కవిత వేర్వేరు ప్రకటనల్లో స్పష్టం చేశారు. ఫార్ములా–ఈ కార్ రేసింగ్‌లో అవకతవకలకు పాల్పడ్డారంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై ప్రభుత్వం పెట్టిన కేసు అక్రమమని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి మండిపడ్డారు. కేటీఆర్‌పై నమోదు చేసిన కేసు రాజకీయ కక్ష సాధింపులో భాగమేనని గురువారం విమర్శించారు. ఈ రకమైన కాంగ్రెస్ దుశ్చర్యలు బీఆర్ఎస్ నేతల నైతిక స్థైర్యాన్ని దెబ్బతీయలేవని స్పష్టం చేశారు. కేటీఆర్ అంటే రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి వణుకు పుడుతున్నదని, ప్రజా సమస్యలపై ఆయన సాగిస్తున్న పోరాటాలకు భయపడి కేసులతో వేధిస్తున్నదని ధ్వజమెత్తారు. కేటీఆర్‌పై తప్పుడు కేసు నమోదుచేయడాన్ని జీవన్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. బీఆర్ఎస్ ప్రశ్నిస్తే తట్టుకోలేకపోతున్న కాంగ్రెస్ ప్రభుత్వం దబాయింపు ధోరణితో అక్రమ కేసులు పెడుతున్నదని ఆరోపించారు. తెలంగాణ ఇమేజ్ పెంచడానికి పనిచేసిన కేటీఆర్ మీద అన్యాయంగా కేసుపెట్టిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రాక్షసానందం పొందుతున్నదన్నారు. ఫార్ములా–ఈ కార్ రేసింగ్‌పై అసెంబ్లీలో చర్చకు పెడితే సమాధానం చెప్పేందుకు రెడీగా ఉన్నట్లు కేటీఆర్ స్పష్టంచేసినా ప్రభుత్వం పట్టించుకోకపోవడం సీఎం నిరంకుశత్వానికి నిదర్శనమన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వ దుర్మార్గ విధానాలకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ శ్రేణులు పోరాడుతాయని హెచ్చరించారు. ప్రజాస్వామ్యవాదులు కేటీఆర్‌పై అక్రమ కేసులు పెట్టడాన్ని ఖండించాలని జీవన్‌రెడ్డి పిలుపునిచ్చారు.





**కేసులతో గొంతు నొక్కలేరు..**

రాజకీయంగా ఎదుర్కోలేని కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్‌ను, కేసీఆర్‌ను లక్ష్యంగా చేసుకుని బనాయిస్తున్న కేసులను ప్రజలు గమనిస్తున్నారు. అసెంబ్లీలో చర్చకు ధైర్యం చేయలేని ముఖ్యమంత్రి.. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై అక్రమ కేసులతో భయభ్రాంతులకు గురిచేయాలని చూడడం రాజకీయ అమాయకత్వం తప్ప మరొకటి కాదు. కేసీఆర్ సైనికులం, తెలంగాణ ఉద్యమ పోరాటం నుంచి పుట్టుకొచ్చిన మమ్మల్ని మీ చిల్లర వ్యూహాలు భయపెట్టలేవు. పోరాటం మాకు కొత్త కాదు. అక్రమ కేసులతో గొంతు నొక్కలేరు.

- కవిత, ఎమ్మెల్సీ



**హామీలపై నిలదీస్తున్నందుకే..**

అధికారంలోకి వచ్చి సంవత్సరం అయినా హామీలు అమలుచేయలేక ప్రజల్లో వస్తున్న వ్యతిరేకతను మళ్లించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నది. అందులో భాగంగానే కేటీఆర్‌పై అక్రమ కేసులు పెట్టింది. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కోసం ఫార్ములా ఈ రేస్‌ను ప్రపంచంలోనే అనేక గొప్ప నగరాలను కాదనుకుని హైదరాబాద్‌కు తీసుకొచ్చిన ఘనత కేటీఆర్‌ది. కానీ రేవంత్ ప్రభుత్వం కక్షపూరితంగా ఈ రేస్‌ను రద్దు చేయడమే కాకుండా ఈ రేస్ నిర్వహణలో అవినీతి జరిగిందంటూ కేటీఆర్‌పై బురద జల్లడానికి ప్రయత్నిస్తున్నది. హామీల అమలుపై ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేలా ప్రశ్నిస్తున్నందునే కేటీఆర్ అడ్డు లేకుండా చేయాలని రేవంత్‌రెడ్డి చూస్తున్నాడు. దీనిపై దమ్ముంటే అసెంబ్లీలో చర్చ పెట్టండని కేటీఆర్ అడుగుతున్నా ప్రభుత్వం చర్చకు రాకుండా పారిపోతున్నది.

- వేముల ప్రశాంత్‌రెడ్డి, మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే

# ఇంటి నుంచే ‘మధ్యాహ్న భోజనం’



ఇంటి నుంచి తెచ్చుకున్న భోజనాన్ని తింటున్న విద్యార్థులు

- బిల్లులు రాక బాధ్యతల నుంచి తప్పుకున్న నిర్వాహకులు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థులు

నిజాంసాగర్, డిసెంబర్ 19: నిజాంసాగర్ జడ్పీఉన్నత పాఠశాలలో 15 రోజులుగా మధ్యాహ్న భోజనం నిలిచిపోయింది. దీంతో విద్యార్థులు ఇంటి నుంచి భోజనం తెచ్చుకోవాల్సి వస్తున్నది. సమయానికి బిల్లులు రాకపోవడంతో మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులు ఈ నెల ఒకటి నుంచి బాధ్యతల నుంచి తప్పుకొన్నారు. పాఠశాలలో సుమారు 230 మంది విద్యార్థులు ఉండగా..వారందరూ ఇంటి నుంచే బాక్సులు తెచ్చుకుంటున్నారు. స్కూల్‌లో వంట చేసేందుకు ఏజెన్సీలు ముందుకురావడంలేదని, అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా వంట చేయించేందుకు ప్రయత్నిస్తున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామచంద్ర గురువారం తెలిపారు.

## పనిచేయని బోరు.. బయటి నుంచే నీరు



బిచ్కుంద జ్యోతిబా పూలే పాఠశాలలో నీటి కొరత ఏర్పడింది. ఒకవైపు మిషన్ భగీరథ నీరు రాకపోవడం, మరోవైపు పాఠశాలలోని బోరు మోటర్ చెడిపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గురువారం బయటి నుంచి బకెట్లలో నీళ్లు తెచ్చుకొని అవసరాలను తీర్చుకోవాల్సి వచ్చింది. అధికారులు స్పందించి బోరు మోటరు వెంటనే బాగు చేయించాలని విద్యార్థులు కోరుతున్నారు.

–బిచ్కుంద, డిసెంబర్ 19



జక్రాన్‌పల్లిలో అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేస్తున్న దళిత సంఘాల నాయకులు

# బీజేపీకి షాక్

భగ్గుమన్న దళిత సంఘాలు



నందిపేట్ మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న దళిత సంఘాల నాయకులు

- అమిత్ షా వ్యాఖ్యలపై ఉమ్మడి జిల్లాలో నిరసనలు
- కేంద్ర మంత్రి దిష్టిబొమ్మల దహనం
- రాజీనామా చేయాలని డిమాండ్

నమస్తే తెలంగాణ యంత్రాంగం, డిసెంబర్ 19 : భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్‌పై కేంద్ర మంత్రి అమిత్ షా పార్లమెంట్‌లో చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ ఉమ్మడి జిల్లాలో నిరసన జ్వాలలు వెల్లువెత్తాయి. గురువారం ఆర్మూర్, జక్రాన్‌పల్లి, రెంజల్, మోర్తాడ్, కమ్మర్‌పల్లి, వేల్పూర్, నందిపేట్, ముప్కాల్, బాన్సువాడ, బీబీపేట్ తదితర మండలాల్లో అంబేద్కర్ సంఘాలు, దళిత సంఘాల ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహాల వద్ద నిరసన ప్రదర్శనలు చేపట్టారు. అమిత్ షా దిష్టిబొమ్మలను దహనం చేశారు. నందిపేట్‌లో అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అంబేద్కర్ రాసిన రాజ్యాంగంవల్లే భారత్‌కు ప్రజాస్వామిక దేశంగా ప్రపంచదేశాల్లో గుర్తింపు వచ్చిందన్నారు. పార్లమెంట్‌లో అంబేద్కర్‌ను అవమానించేలా మాట్లాడిన అమిత్‌షా వెంటనే తన కేంద్రమంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఆయన వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని భరతజాతికి క్షమాపణలు చెప్పాలన్నారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



బాన్సువాడ మండలం బోర్లంలో అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేస్తున్న దళిత నాయకులు



నిజామాబాద్ జిల్లా మాక్లూర్‌లో మాల నాయకులను అరెస్టు చేసి ఠాణాలో ఉంచిన పోలీసులు

# మాల మహానాడు నేతల నిర్బంధం



నవీపేటలో మాల నాయకులను అరెస్టు చేసి ఠాణాలో ఉంచిన పోలీసులు

నమస్తే తెలంగాణ యంత్రాంగం, డిసెంబర్ 19 : నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా మాల మహానాడు నేతలను పోలీసులు గురువారం నిర్బంధించారు. ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ చలో అసెంబ్లీ ముట్టడికి మాల సంఘం నాయకులు పిలుపునిచ్చిన నేపథ్యంలో.. పోలీసులు ఎక్కడికక్కడ అరెస్టులు చేశారు. జిల్లాలోని బోధన్, నందిపేట్, మాక్లూర్, ఆర్మూర్, రుద్రూర్, డిచ్‌పల్లి, జక్రాన్‌పల్లి, పోతంగల్ తదితర మండలాల్లో తెల్లవారుజామునే ముఖ్య నాయకుల ఇండ్లకు వెళ్లి ఠాణాలకు తరలించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి మాలలు ఐక్యంగా ఓట్లు వేసి గెలిపిస్తే, ఇలా అన్యాయం చేయడం సరికాదని మాల మహానాడు నేతలు మండిపడ్డారు. అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని హెచ్చరించారు.